సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 10 । ఆగస్టు । 2023



మెరుగైన వైద్యం
దేవరకద్ర పీహెచ్‌సీని 100 పడకలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.
వివరాలు 8లో ▸



ప్రపంచానికి తెలిసేలా..
అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక శాఖ ఎస్‌ఈ ఎండీ సంయుద్దీన్ పరిశీలించారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /24.3
వాతావరణం
ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీలో తనిఖీ



రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఎన్‌క్యూఏఎస్ బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. కేంద్రం ద్వారా గుర్తింపు లభించేందుకు కావాల్సిన సుదుపాయాలు, సౌకర్యాలు ఆస్పత్రిలో ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించారు. ఇన్ పేషంట్, ఔట్ పేషంట్, ల్యాబ్, రిజిస్టర్ నిర్వహణ, మందుల వాడకం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వైద్య సిబ్బందితో మాట్లాడారు. డాక్టర్ భవిన్ వగదీయ, అశోక్ పాల్గొన్నారు.

సదరం క్యాంపులను వినియోగించుకోవాలి

గద్వాల న్యూటౌన్: ఆగస్టు నెలలో నిర్వహించనున్న సదరం క్యాంప్‌ల ప్రణాళికను బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి ఉమాదేవీ విడుదల చేశారు. ఆగస్టు 22, 29వ తేదీల్లో (మంగళవారం) కంటి, శారీరక, మానసిక వికలత్వం ఉన్న దివ్యాంగులకు, 16, 23, 30వ తేదీల్లో (బుధవారం) శారీరక వికలత్వం ఉన్న దివ్యాంగులకు, 11, 18, 25వ తేదీల్లో (శుక్రవారం) చెవిటి, మూగ వికలత్వం ఉన్న దివ్యాంగులకు సదరం క్యాంప్‌లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందు మీ–సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

గద్వాల: జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలను ఈ నెల 11వ తేదీ ఉదయం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ తెలిపారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2023–24 సంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, అధికారులు అర్హులన్నారు. జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు 17 అంశాల క్రీడలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 20, 21 తేదీలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

12న చేనేత వారోత్సవాలు

గద్వాల: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో చేనేత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకుడు గోవిందయ్య తెలిపారు. చేనేత వస్త్ర వాడకం, చేనేత కళలను ప్రోత్సహించుట తదితర అంశాలపై కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు, అనంతరం సీనియర్ చేనేత కార్మికులకు సన్మానం, విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు. కలెక్టరేట్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సాంప్రదాయ చేనేత వస్త్రాధారణతో ఫ్యాషన్ షో ఏర్పాటు చేశామన్నారు.

నవోదయ గడువు పెంపు

బిజినేపల్లి: వచ్చే 2024– 25 సంవత్సరానికి గాను వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్పీని కలిసిన ఆర్ఐ

గద్వాల క్రైం: జిల్లా సాయుధ బలగాల ఆర్ఐగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన సూర్యపేట జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు వచ్చారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

మల్దకల్: మండలంలోని తాటికుంటలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ పనులను సెంట్రల్ టీం సభ్యులు దాసరి నాగసైనీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డ్, నర్సరీలను పరిశీలించారు. అలాగే పనులు చేసిన ప్రదేశాలను తనిఖీ చేశారు. ప్రజలు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఏపీఓ స్వామి, సర్పంచు ఆంజనేయులు పాల్గొన్నారు.

వేరుశనగ @ 6,781

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 529 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. క్వింటాకు గరిష్టం రూ.6781, కనిష్టం రూ.3780, సరాసరి రూ. 5062 ధరలు లభించాయి.

వందేభారత్ సందడి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సందడి చేసింది. ట్రయల్ రన్ కోసం కాచిగూడ నుంచి బయలుదేరిన రైలు ఉదయం 11.50 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని ఒక్క నిమిషం పాటు ఆగింది. దీంతో వందేభారత్ రైలును తిలకించడానికి ప్రయాణికులు ఆసక్తి కనబరిచారు. స్టేషన్‌లో ఒక్క నిమిషం ఆగడంతో కొంతమంది ప్రయాణికులు రైలు ఎదుట సెల్ఫీలు తీసుకున్నారు. సీనియర్ సిటిజన్లు వందేభారత్ రైలు స్టేషన్‌కు రావడంతో స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. అయితే వందేభారత్ రైలు జడ్చర్ల స్టేషన్‌లోనూ నిలుపుతారని రైల్వే అధికారులు ప్రకటించారు. కానీ, ట్రయల్ రన్‌లో మాత్రం జడ్చర్లలో ఆగకపోవడంతో స్థానికులు నిరుత్సాహానికి గురయ్యారు. – స్టేషన్ మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ స్టేషన్‌లో ఆగిన వందేభారత్ రైలు

నీళ్లున్నా.. నిరుపయోగం



నీటితో నిండిన ముచ్చోనిపల్లి రిజర్వాయర్

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ముచ్చోనిపల్లి రిజర్వాయర్ కాల్వ పనులు
- డీజిల్ ఇంజిన్లతో నీటి తడులు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడి ఖర్చులు
- 12,260 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా రిజర్వాయర్ల నుంచి నడిగడ్డ పంటపొలాలకు సాగునీరందించేందుకు ఏర్పాటు చేస్తున్న కాల్వ పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాల్వ పనులు పూర్తి కావడం లేదు. రిజర్వాయర్‌లోని నీరు పంట భూములకు పూర్తిగా చేరడంలేదు. ముచ్చోనిపల్లి రిజర్వాయర్ నుంచి అయిజ మండలంలోని వివిధ గ్రామాల శివార్లలోని పంటపొలాలకు కాల్వ ద్వారా సాగునీరందించాల్సి వుండగా కాల్వ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో అయిజ మండలంలోని రైతులకు నెట్టెంపాడు సాగునీరు కలగానే మిగిలింది. నీటితడులు లేని పంటలు దిగుబడి రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

రూ.38.25కోట్లతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్
దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కృషితో నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పనులు 2006 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా 109 ప్యాకేజీ కింద జిల్లాలోని గట్టు మండలంలోని ముచ్చోనిపల్లి శివారులో రూ. 38.25 కోట్లు ఖర్చు చేసి 1.634 సామర్థ్యం గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. దీంతో సుమారు 2,500 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 16,000 ఎకరాలకు సరిపడా నీటిని నిల్వ ఉంచుతారు. అయితే 107 ప్యాకేజీ ద్వారా ర్యాలంపాడు దగ్గర ఏర్పాటు చేసిన ఎత్తిపోతల నుంచి మెయిన్ కెనాల్ ద్వారా 38 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అనుకోని పరిస్థితుల్లో మెయిన్ కెనాల్ నుంచి పంట పొలాలకు సాగునీరందని సందర్భంగా పంటలు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సాగునీటిని చిన్న కాల్వలకు విడుదల చేసేందుకు ఏర్పాటు చేశారు.

అసంపూర్తిగా వదిలేశారు..



నెట్టెంపాడు ప్రాజెక్ట్ నుంచి పంట పొలాలకు సాగునీరు అందిస్తారని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. పంటపొలాల్లో యంత్రాలతో కాల్వలు తవ్వి అసంపూర్ణంగా వదిలేశారు. ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌లో నీళ్లున్నా లాభం లేకుండా పోయింది. కాల్వలు తవ్వకుండా ఉన్నా సరే ఆ స్థలంలో పంటలు సాగు చేసే వాళ్లం.
– బజారి, తూంకుంట

సాగునీరు అందేలా చూడాలి



నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా కాల్వలు తవ్వే పనులు పూర్తికాక పోయినాసరే పంట పొలాల్లో కాల్వలు పోయిన రైతులతో పాటు చుట్టుపక్కల పంట పొలాలున్న రైతులు డీజిల్ ఇంజన్లతో ఎట్లోలాగా పైరుకు నీళ్ల కడుతున్నారు. కాల్వలకు దూరంగా పంట భూములున్న వారి పరిస్థితి దీనంగా వుంది. ఇప్పటికైనా కాల్వ పనులు పూర్తి చేసి పంటలకు సాగునీరు విడుదల చేయాలి.
– దేవేంద్ర, ఎక్లాస్‌పురం

త్వరలోనే పూర్తిచేస్తాం



కాల్వ పనులు పూర్తిచేసేందుకు కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయి. పంట పొలాలకు సంబంధించి కొన్ని కోర్టు కేసులు ఉన్నాయి. భూసేకరణ అధికారులు రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తే పనులు పూర్తిచేయవచ్చు. చిన్న కాల్వలు తవ్వేందుకు కొందరు రైతులు అభ్యంతరం తెలుపుతున్నారు. నిధుల కొరతతో కూడా పనులు ఆలస్యమవుతున్నాయి. సమస్యలను పరిష్కరించి కాల్వ పనులు త్వరగా పూర్తి చేస్తాం.
– వెంకటేశ్వరరావు, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ ఈఈ

12వేల ఎకరాలకు సాగునీరు అందట్లే..
ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో భాగంగా 107 ప్యాకేజీ ద్వారా మొత్తం 38వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 25,260 ఎకరాలకు మాత్రమే సాగునీటిని అందిస్తున్నారు. ఇంకా 12,740 ఎకరాలకు సాగునీరు సరఫరా కావడంలేదు. ఫీటు కాల్వ పనులు ఇప్పటి వరకు అసలు ప్రారంభించనే లేదు. పనులు నత్తనడకన సాగుతుండడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. కొన్ని ప్రదేశాల్లో కాల్వ పనులు పూర్తయినా కొంతమంది రైతులకు నష్టపరిహారం అందలేదు. దీంతో అక్కడక్కడ కాల్వలు తవ్వే పనులు నిలిచిపోవడం.. కాల్వలు తవ్వినా సరే సాగునీటి సరఫరా లేకుండా పోయింది. విధిలేక రైతులు డీజిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు సాగునీరు అందిస్తున్నారు.



కాల్వ నుంచి డీజిల్ ఇంజిన్ల సాయంతో నీటిని తోడుతున్న దృశ్యం

ఎన్నికల కోసమే గృహలక్ష్మి పథకం



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కోసమే గృహలక్ష్మి పథకాన్ని మొదలు పెట్టిందని, సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని, అలాంటిది మూడు నెలల్లో 3వేల ఇండ్లు, గృహలక్ష్మి పథకంతో రూ.3లక్షల ఇస్తారా.. అని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి లాభం చేకూరే మద్యం టెండర్ల దరఖాస్తుకు 15రోజుల గడువు ఇచ్చి.. నిరుపేదల సంక్షేమ గృహలక్ష్మి పథకానికి 3 రోజులే గడువు ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. ప్రజల పన్నులతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయని, గృహలక్ష్మి పథకానికి గడువు పొడగించి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. వందలాది మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్ర సాధించుకున్నామని, కానీ తెలంగాణ లక్ష్యం, ధ్యేయం నేరవేరలేదన్నారు. గద్వాలకు కొత్తగా ఇండస్ట్రీ, ఉపాధి, ప్రాజెక్టు కానీ రాలేదని, ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం జరగకపోవడం బాధాకరమని, స్వలాభం కోసం పాకులాడే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే గద్వాల అభివృద్ధి సాధ్యమని, ఇందుకోసం అందరు కలిసి కట్టుగా పనిచేద్దామని చెప్పారు. అదేవిధంగా క్విట్ ఇండియా డేను పురస్కరించుకొని జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, టీపీసీసీ మెంబర్ శంకర్, సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్, నారాయణ రెడ్డి, వీరుబాబు, తిరుపతయ్య, ఇసాక్, నల్లారెడ్డి, గట్టు గౌస్, గట్టు కృష్ణమూర్తి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం పాటుపడ్డానని, ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన నా హయాంలోనే గద్వాల నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రముఖులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్‌స్థాయి అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీఎస్ కోసం ప్రాణాలను పణంగా పెట్టి కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి నెట్టెంపాడు ప్రాజెక్టును సాధించానని తెలపారు. గద్వాల జిల్లా కోసం అలుపెరగని ఉద్యమాన్ని చేసి ప్రజల మన్ననలు పొందానని వివరించారు. సీఎం కేసీఆర్ చెప్పే పిట్టకథలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో గద్వాలలో జరిగిన అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. ఇక్కడి బీఆర్‌ఎస్ నాయకులు సొంత ప్రయోజనాల మీద చూపిస్తున్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై కొరవడిందని మండిపడ్డారు. అక్రమ దందాలో ఆరితేరారని ఆరోపించారు. రాబోవు ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే అని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణరెడ్డి, ప్రకాష్‌రావు, రామంజనేయులు వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వారి త్యాగ ఫలితం కారణంగానే దేశంలోని ప్రజలు బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందామని డీకే అరుణ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, క్విట్ ఇండియా ఉద్యమం జరిగి 84 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు, మాజీ సైనికులు తదితర వారిని పార్టీ కార్యాలయంలో డీకే అరుణ ఘనంగా సన్మానించారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

గద్వాల రూరల్: కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని ఏఎన్‌ఎంలతో కలిసి ధర్నా చేపట్టారు. ఆట,పాటలతో నిరసన తెలియజేశారు. ఆర్టీసీ, వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసిన తరహాలోనే గత పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 16వ తేదీ నుంచి నిరవదిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, రంగన్న, ఏఎన్‌ఎంలు పద్మావతి, విద్యావతి, జ్యోతి, రాధ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం

డిగ్రీ కళాశాలల్లో 45 శాతం కూడా భర్తీ కాని సీట్లు
- ఇప్పటికే దోస్త్ ద్వారా మూడు దశల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ
- 25 శాతంలోపు అయిన కళాశాలల కోర్సులు ఇతర వాటికి బదిలీ
- ప్రశ్నార్థకంగా మారిన పలు ప్రైవేటు కాలేజీల భవితవ్యం
- స్పెషల్ ఫేజ్ కింద అడ్మిషన్లకు 13 వరకు గడువు



పాలమూరు యూనివర్సిటీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ సీట్ల భర్తీని ప్రభుత్వం దోస్త్ ద్వారా చేపట్టింది. రెండు నెలల క్రితమే ఈ ప్రక్రియ ప్రారంభించినా.. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా గత నెల చివరి నాటికే మూడు దశల్లో పూర్తిచేయాలి. కానీ, ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు కనీసం 45 శాతం కూడా సీట్లు భర్తీ కాలేదు. పీయూ పరిధిలో మొత్తం 21,740 సీట్లు ఉండగా.. ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి అయినప్పటికి కేవలం 9,478 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకోవడం గమనార్హం. ప్రతి సంవత్సరం సాధారణంగా 65 శాతానికిపైగా అడ్మిషన్లు జరుగుతాయి. దీంతో మరో మారు ఆన్‌లైన్‌లో ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండగా 18 సీట్లు అలాట్ చేస్తారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..
ఉమ్మడి జిల్లాలో మొత్తం 60 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు జరిగాయి. అయితే చాలా కళాశాలల్లో కనీసం 45 నుంచి 50 శాతం కూడా భర్తీ కాలేని పరిస్థితి నెలకొంది. మొదటి దశ కౌన్సెలింగ్ వివిధ ప్రైవేట్ కళాశాలల్లో ఉన్న కోర్సుల్లో 25 శాతం సీట్లు భర్తీ కాకపోతే, సంబంధిత కళాశాలల్లో కోర్సులను అధికారులు రద్దు చేస్తున్నారు. అప్పటి వరకు జరిగిన అడ్మిషన్లను ఇరత కళాశాలలకు బదిలీ చేసి విద్యార్థులకు అక్కడ తరగతులు బోధిస్తున్నారు. కొన్ని కోర్సుల్లో అడ్మిషన్లు తక్కువ అయినా విద్యార్థులను అలాగే కొనసాగిస్తే కళాశాల నిర్వహణ యాజమాన్యానికి భారంగా మారి, వారికి బోధన, ప్రయోగాలు తదితర అంశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో కనీసం 5 కళాశాలలు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని, వాటి పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

➪ ఇదిలా ఉండగా.. ఉమ్మడి జిల్లాలోని 20 ప్రభుత్వ కళాశాలల్లో పెద్దఎత్తున సీట్లు భర్తీ అయినట్లు తెలుస్తుంది. చాలామంది విద్యార్థులు ఎలాంటి ఫీజులు లేకుండా ఆన్‌లైన్‌లో మొదటి ప్రాధాన్యత కింద ప్రభుత్వ కళాశాలల ఆప్షన్ ఇచ్చుకున్నారు. అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను సైతం అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థులు అటువైపు మొగ్గచూపారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

కోర్సు	సీట్లు	భర్తీ అయినవి
బీఏ	6,830	2,929
బీకాం	4,580	2,493
బీఎస్సీ	9,910	3,862
ఇతర కోర్సులు	420	194
మొత్తం	21,740	9,478

స్పెషల్ ఫేజ్‌కు అనుమతి..
పీయూ పరిధిలో ప్రభుత్వం దోస్త్ ద్వారా సీట్ల భర్తీకి మూడు దశల్లో ప్రక్రియ చేపట్టిన పూర్తిస్థాయిలో కాలేదు. దీంతో మరోసారి స్పెషల్ ఫేజ్‌కు అనుమతి ఇచ్చింది. అలాగే 25 శాతం కన్నా తక్కువ అడ్మిషన్లు జరిగిన కళాశాలల్లో ఉన్న పలు కోర్సులను ఇరత కళాశాలలకు బదిలీ చేయాలని ప్రభుత్వం సూచించింది.
– చంద్రకిరణ్, అకాడమిక్ ఆడిట్ సెల్, పీయూ

అత్యధికంగా బీఎస్సీలోనే..
పీయూ పరిధిలో ప్రైవేటు కళాశాలతోపాటు రెండు ప్రభుత్వ కళాశాలల్లో సైతం తక్కువగా అడ్మిషన్లు తక్కువ కావడం పట్ల అధికారులు కారణాలను వెతికే పనిలో ఉన్నారు. ప్రధానంగా గురుకులాల్లో డిగ్రీ కోర్సులు రావడంతో వారు నేరుగా సంబంధిత బోర్డుల ద్వారానే విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నారు. అలాగే ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాలకు మెడికల్ కళాశాలలు మంజూరవడంతోపాటు చాలా మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్ కోర్సులపై మక్కువ చూపుతున్నారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే బీకాం, బీఏ వంటి కోర్సులతో పోల్చితే బీఎస్సీలోనే అధికంగా 3,862 మంది విద్యార్థులు జాయిన్ కాగా.. మిగతా వాటిలో తక్కువ అడ్మిషన్లు జరిగాయి.

భాషపై పట్టు సాధించేలా బోధన

గద్వాల/గట్టు/మల్దకల్: విద్యార్థులు భాష, గణితంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర పర్యవేక్షకులు చంద్రశేఖర్, మణికంఠ సూచించారు. స్థానిక ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గద్వాల, ధరూర్, కేటీదొడ్డి మండలాల ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా కార్యక్రమాన్ని వారు బుధవారం సందర్శించారు. తొలిమెట్టు ఆవశ్యకత, గత సంవత్సరం సాధించిన లక్ష్యాలు, వచ్చిన మార్పులను తెలుసుకున్నారు. పాఠ్య ప్రణాళికలు, అభ్యసన కృత్యాల పుస్తకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్ణీత పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని చెప్పారు. ఉపాధ్యాయులు తమ బోధనతో విద్యార్థులను ఆకట్టుకోవాలని, అందుకు నిత్యం కథలు, గేయాలతో వినూత్న బోధనకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, శ్రీనివాస్‌గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, హనుమంతు, జిల్లా, మండల ఆర్పీలు షేక్షా, రాఘవేంద్ర, స్వాతి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

జూరాల కాల్వలో మృతదేహం లభ్యం

పెబ్బేరు: మండల పరిధిలోని బున్యాధిపూరం సమీపంలో జూరాల డిస్ట్రిబ్యూటర్ 19 కాల్వలో బుధవారం గుర్తు తెలియని (38) మృతదేహం లభ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎగువ ప్రాంతాలు జూరాల, రామన్‌పాడు ప్రాజెక్టుల ప్రధాన కాల్వ ద్వారా వ్యక్తి మృతదేహం కొట్టుకు రావడంతో లింక్ కాల్వ బున్యాధిపూర్ శివారులో నీటిలో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని వివరాలు సేకరించారు. ఒంటిపై బట్టలు లేవు, వయస్సు(38), మొలతాడు, చిన్నగా మీసాలు, తల వెంట్రుకలతో పాటు ఎడమ చెవి కింది భాగాన తెగినట్లు గుర్తించారు. మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని గుర్తించినట్లైతే సెల్ 8712670624 నంబర్‌కు ఫోన్ చేసి ఎస్ఐ జగదీశ్వర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెంకట్రాములు(48) ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం ప్రధాన రోడ్డు పక్కనున్న తడకల హోటల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య బాలమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో 18 నెలల జైలు శిక్ష

బిజినేపల్లి : మండలంలోని బిజినేపల్లి, నంది వడ్డెమాన్‌కు చెందిన గుడ్ల చెన్నయ్య, బత్తుల రాములు ఇండ్లలో వడ్డె గోపాల్ చోరీకి పాల్పడ్డాడు. అతనిపై కేసు నమోదై బుధవారం 18 నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నాగర్‌కర్నూల్ 2 అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పుట్ట మౌనిక తీర్పు ఇచ్చారు. 2016లో బత్తుల రాములు, గుడ్ల చెన్నయ్య ఇంట్లో దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం తీర్పు రావడంతో పోలీసులు వడ్డె గోపాల్‌ను రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

అడ్డాకుల: మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన వ్యక్తికి కోర్టు 10 రోజుల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన కావలి నాగరాజు ఇటీవల మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 10 రోజుల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి జైలుపాలు కావొద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

వ్యక్తికి 14 రోజుల రిమాండ్

ఖిల్లాఘణపురం: భార్య కాపురానికి రాలేదని అత్తింటికి నిప్పుపెట్టిన అల్లుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన శివయ్య భార్య లక్ష్మి కాపురానికి రావడంలేదని, ఆమె తల్లిగారి ఇంట్లో ఉందని ఈనెల 7వ తేదీ మధ్యరాత్రి పెట్రోల్ పోసి ఇంటికి నిప్పుపెట్టిన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయమై అతని అత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శివయ్యను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని వనపర్తి కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడికి..

నాగర్‌కర్నూల్ క్రైం: చోరీ కేసులో బుధవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఈనెల 5న జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీపుటేజీలో తెల్కపల్లికి చెందిన శ్రీను చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


బాలుడిపై వీధికుక్క దాడి



జడ్చర్ల: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు బావీష్(4)పై వీధి కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వెంకటేశ్వర కాలనీలో పావని, కృష్ణ నివాసముంటున్నారు. వారి కుమారుడు బావీష్ వీధిలో ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. వెంటనే తల్లిదండ్రులు కుక్కను తరమేశారు. కుక్కదాడిలో బాబుకు మొఖం, చేతులపై గాయాలయ్యాయి. దీంతో బాబును వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పట్టణంలో వీధి కుక్కలు, పందుల బెడద తీవ్రమైనట్లు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు కుక్కలు, పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల చెంతకు మెరుగైన వైద్యం

- దేవరకద్రకు 100 పడకల ఆస్పత్రి..
- నిర్మాణానికి రూ.35కోట్లు మంజూరు
- ఫలించిన ఎమ్మెల్యే ఆల కృషి..



ఆస్పత్రి ఏర్పాటుకు సంబంధించిన జీవో



దేవరకద్రలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దేవరకద్ర రూరల్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న దేవరకద్ర నియోజకవర్గ ప్రజల కల నెరవెరబోతోంది. కొద్ది రోజుల్లోనే అధునాతన కార్పొరేట్ వైద్య సేవలు ప్రజల చెంతకు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆరు పడకల ఆస్పత్రి నుంచి ఏకంగా 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. నూతన భవన నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు రూ.35 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2018 ఎన్నికల సమయంలో దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చుతున్నది. ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తైతే దేవరకద్ర పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

వైద్యం అందక ఇబ్బందులు..

నియోజకవర్గ కేంద్రం, గ్రామాల్లో జనాభా పెరగడంతో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రికి రోగుల సంఖ్య నిత్యం పెరుగుతోంది. రాయచూర్–హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను కలిపే ఏకైక అంతర్రాష్ట్ర రహదారి మార్గం కావడంతో ఏ ప్రమాదం జరిగినా క్షతగాత్రులను సత్వర వైద్యం కోసం దేవరకద్ర ఆస్పత్రికి తీసుకొస్తారు. ఇక్కడున్న ఆరు పడకల ఆస్పత్రిలో డాక్టర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సరైనా సేవలు అందకపోవడంతో మెరుగైన వైద్యసదుపాయాల కోసం జిల్లా కేంద్రానికి లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అందుబాటులో అధునాతన వైద్యం..

ప్రభుత్వ నిర్ణయంతో దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటి వరకు ఉన్న ఆరు పడకల ఆస్పత్రిని 100 పడకల ఏరియా ఆస్పత్రి మారుబోతోంది. రూ.35 కోట్ల వ్యయంతో నూతన భవనం, 100 పడకలకు బెడ్స్, అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆస్పత్రి పూర్తయితే వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, సపోర్టింగ్ స్టాఫ్, పరీక్షలకు ల్యాబ్ తదితర సేవలు పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఏరియా ఆస్పత్రి ఏర్పాటైతే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి వెసులు బాటు కలుగుతుంది. నియోజకవర్గంలోని కౌకుంట్ల, చిన్నచింతకుంట, మూసాపేట, కోయిల్‌కొండ మండలాలు, మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని గ్రామాలు, నారాయణపేట జిల్లాలోని మరికల్, ధన్వాడ మండలాల్లోని గ్రామాల ప్రజలు వైద్య సేవాలు ఇక్కడే పొందవచ్చు.

ఫలించిన ఎమ్మెల్యే కృషి..

వైద్యం కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో 2018 ఎన్నికల సమయంలో ఇక్కడి ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై పలుమార్లు ప్రభుత్వానికి వినతి చేశారు. గత నెల 22న సీఎం కేసీఆర్‌ను కలిసి దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు అవశ్యకతను వివరించారు. సీఎం స్పందిస్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు ఫోన్ చేసి ఆస్పత్రి మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అనుమతితో పాటు రూ.35 కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ జీవోను ఈ నెల 4న మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి అందజేశారు. 100 పడకల నూతన ఆస్పత్రిని జిల్లా కేంద్రానికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారికి అనుకొని ఉన్న బృహత్ పల్లె ప్రకృతి వనం సమీపంలో నిర్మించే అవకాశం ఉంది.

వైద్య ఇబ్బందులు తొలుగుతాయి..



దేవరకద్రకు 100 పడకల ఆస్పత్రి మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ప్రమాదంలో గాయపడిన, పాము కాటుకు గురైనా సకాలంలో వైద్య సహాయం అందక ప్రాణాలు పోయే పరిస్థితులున్నాయి. కొత్త ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారు.

– మున్నూర్ బాల్‌రాజు, దేవరకద్ర

వేగంగా పనులు..



సీఎం కేసీఆర్ పాలనలో వైద్యరంగం ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం దేవరకద్రలో ఆరు పడకల ఆస్పత్రిని త్వరలోనే 100 పడకలకు మారనుంది. ఇక్కడ ఆస్పత్రి నిర్మిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అందుకు సంబంధించిన పనుల ప్రక్రియ వేగంగా సాగుతోంది.

– ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

- ఐటీడీఏ వద్ద ఆదివాసీలతో కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి



ఐటీడీఏ ఆవరణలో చెంచు మహిళలతో నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

మన్ననూర్: ఆదివాసి గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అన్ని విధాలుగా కృషి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో చెంచు నాయకులు, ఉద్యోగులు, ఆయా గ్రామాల ఆదివాసీలతో కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జెండాను ఎగురవేశారు. ఐటీడీఏలో సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ ఆయా డిపార్ట్‌మెంట్‌ల నుంచి డిప్యూటేషన్‌పై అన్ని శాఖలలో నియామకాలు చేశామని అన్నారు. దీంతో ఆదివాసీలకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించేందుకు అవకాశాలు ఉందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా మెరుగుపడినప్పుడే మన హక్కులను మనం సాధించుకోగలుగుతామని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. అంతకు ముందు ఆదివాసి చెంచు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నిమ్మల శ్రీనివాసులు చెంచుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పోడు భూముల పట్టాలు ఇంకా కొంత మందికి రావాల్సి ఉందన్నారు. గృహలక్ష్మి పథకంలో చెంచులకు ప్రత్యేకంగా ఇళ్లు కేటాయించడంతో పాటు, అర్హులుగా ఉన్న నిరుద్యోగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి ఆదివాసీలకే అవకాశాలు కల్పించాలన్నారు. అటవీశాఖలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే నిరుద్యోగ సమస్య కొంత తీర్చినవాళ్లు అవుతారని చెప్పారు. స్పందించిన కలెక్టర్ ఆదివాసీల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని అన్నారు. ప్రత్యేకించి ఆదివాసులు ప్రతి విషయానికి ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సమాఖ్యలతో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తూ, తన అభిప్రాయం కూడా అదేనని కలెక్టర్ అన్నారు. విద్య, వైద్యంతో పాటు ఉపాధి కల్పన విషయంలో తప్పకుండా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఇక మీదట వారంలో ఒకటి రెండు రోజులు ఐటీడీఏ మన్ననూర్ కార్యాలయంలో ఆదివాసీలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య తీర్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. జిల్లాలో ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని ఆదివాసీ మహిళాలు కొంత చురుగ్గా ఉన్నారని కొనియాడారు. ఈ క్రమంలో రూ.40–50 లక్షలతో ఒక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తే ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని తాను హామీ ఇస్తున్నాని అన్నారు. ఆదివాసీలను ముందుకు అడుగులు వేయిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, పీసా కోఆర్డినేటర్స్, ప్రజా ప్రతినిధులు, ఎన్‌జీఓలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఏఓ జాఫర్ హుసేన్, డిప్యూటీ డీఈఓ శంకర్, లక్ష్మయ్య, ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు శ్రీనువాసులు, రాజేంద్రప్రసాద్, మల్లేష్, లింగయ్య, అయోధ్య, గోపాల్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

మన్ననూర్: ఉమామహేశ్వర, జంగాల కాలనీల్లో నాటుసారా తయారీదారుల ఇళ్లపై బుధవారం మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అచ్చంపేట ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటు సారా తయారీ కోసం సిద్ధం చేసిన 250 లీటర్ల బెల్లం పానకం, 10 లీటర్ల నాటుసారా, పటిక, బెల్లం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఒక మహిళపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోసారి నాటుసారా తయారు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎక్సైజ్ ఎస్సై సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం నిల్వపై జాగ్రత్తలు తప్పనిసరి



మూసాపేటలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జ్యోతి

అడ్డాకుల: ధాన్యం నిల్వపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో బుధవారం డబ్ల్యూడీఆర్ఏ(వేర్‌హౌజ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటర్ అథారిటీ), ఎన్‌డబ్ల్యూఆర్(నెగోషియల్ వేర్‌హౌజ్ అథారిటీ)పై రైతులు, వ్యాపారులు, పప్పు మిల్లు యాజమానులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వాహణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ మరియదాస్, డాక్టర్ పీ జ్యోతిలు ఎన్‌డబ్ల్యూఆర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకలు, అడవి పందులు, కోతుల యాజమాన్యం గురించి వివరించారు. జాగ్రత్తలు పాటించపోతే 10 నుంచి 30శాతం ధాన్యం ఎలుకల మూలంగా నష్టపోతుందన్నారు. గోదాముల్లో నిల్వ చేసే ధాన్యంపై 4 నుంచి 7 శాతం రుణం పొందే అవకాశం ఉందని రైతులకు వివరించారు. తర్వాత మంచి ధర వచ్చినప్పుడు ఆన్‌లైన్ ద్వారా ధాన్యం అమ్ముకొవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అర్చన, డాక్టర్ ప్రవీన్, మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌చందర్‌గౌడ్ ఉన్నారు.

వనపర్తిలో శ్వేతనాగు

వనపర్తి: పట్టణంలోని కమలానగర్ కాలనీలో బుధవారం తెల్లని నాగుపాము(శ్వేతనాగు) కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు సాగర్స్ స్నేక్ సొసైటీ నిర్వాహకులు చీర్ల కృష్ణసాగర్ అక్కడికి వెళ్లి పామును పట్టుకున్నారు. అరుదుగా కనిపించే తెల్ల నాగుపాము (శ్వేతనాగు)ను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. సైన్స్ ప్రకారం తన్యులోపం వల్ల తెల్లని వర్ణంలో పాములు ఉంటాయని నిపుణులు తెలిపారు. శ్వేతనాగును అచ్చంపేట అటవి ప్రాంతంలో వదిలేస్తామని సొసైటీ నిర్వాహకులు తెలిపారు.



జూరాలకు 44 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రానికి 44 వేల క్యూసెక్కులకు తగ్గిందన్నారు. మూడు గేట్లను మూసి రెండు గేట్ల ద్వారా దిగువకు 8,222 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు 44 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు వివరించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 38,306 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 138 క్యూసెక్కులు, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వకు 870 క్యూసెక్కులు మొత్తం 49,251 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.949 టీఎంసీల నీటినిల్వ ఉంది.

121.418 ఎంయూ విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. బుధవారం 11 యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల నుంచి 200 మెగావాట్లు, 59.633 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేయగా.. దిగువలో ఆరు యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 61.785 మి.యూ. విద్యుదుత్పత్తి సాధించారు. ఇప్పటి వరకు 121.418 మి.యూ. ఉత్పత్తి చేపట్టారు.

శ్రీశైలంలో 864.3 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 864.3 అడుగుల నీటిమట్టం, 120.0754 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో జూరాల ఎగువ, దిగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 46,508 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి వదిలారు. ఇదే సమయంలో టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 40,259 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 6.974 మి.యూ. విద్యుదుత్పత్తి చేసి 13,603 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. శ్రీశైలం జలాశయంలో 314 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ప్రపంచానికి తెలిసేలా అలంపూర్ అభివృద్ధి

- కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం నిధులతో నిర్మాణం
- పర్యాటక శాఖ ఎస్ఈ ఎండీ సంయుద్దీన్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని ప్రపంచానికి తెలిసేలా అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం నిధులతో మూడు అంతస్తుల భవనం నిర్మాణం చేపట్టింది. ఈ పనులను బుధవారం పర్యాటక శాఖ ఎస్ఈ ఎండీ సంయుద్దీన్ పరిశీలించారు. ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్, ఏఈ అనురాగ్‌రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ ఎంవీ శ్రీధర్‌లు పరిశీలించారు. పనులు సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. ప్రస్తుతం పాల్స్‌రూఫ్ పనులను వారు పరిశీలించారు. ఆలయం దగ్గర ఏర్పాటు చేయాల్సిన హై మాక్స్ లైట్ పనులపై కేంద్ర పురాతత్వ శాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, వారి నుంచి అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామన్నారు. అందుకు సంబంధించిన మెటీరియల్ సిద్ధంగా ఉందని డీఈ ధన్‌రాజ్ తెలిపారు. నవబ్రహ్మ ఆలయాలన్నీ కనువిందు చేసేవిధంగా లైట్ అండ్ సౌండ్ షో పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. టెండర్లు పూర్తై చైన్నైకి చెందిన శివపిళ్లై ఈ పనులు చేపడుతారన్నారు. పుష్కరఘాట్ పరిశీలించి బోట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పనులు పూర్తి కాగానే అలంపూర్ నైసర్గిక స్వరూపం ఒక్కసారిగా మారి ఈ ప్రాంత వైశిష్ట్యం ప్రపంచానికి చాటి చెప్పేలా తయారవుతుందన్నారు. వీరితో పాటు ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటనారయణ, వెంకటేశ్వర్ రెడ్డి, చాకలి వెంకటేష్, మాజీ సభ్యుడు నీలప్ప, ఆనంద్ శర్మ ఉన్నారు. అనంతరం ఎస్‌సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్, జిల్లా అధికారులు రమేష్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్యలు వారిని శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు.

విశ్వశాంతి మహాయాగంతో సస్యశ్యామలం



యాగం ఏర్పాట్లు పరిశీలిస్తున్న స్వరూపానంద, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- మహాయాగం నిర్వాహకులు కృష్ణజ్యోతి స్వరూపానందం

జడ్చర్ల టౌన్: విశ్వశాంతి మహాయాగంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని యాగం నిర్వాహకులు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 27 వరకు జడ్చర్ల ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలోని ఖాళీప్రదేశంలో నిర్వహిస్తున్న యాగం ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 79మహాయాగాలు నిర్వహించానని, 80వ యాగం ఇక్కడ నిర్వహిస్తున్నారన్నారు. 14రోజుల పాటు జరిగే యాగంలో ప్రతిరోజు విశేష కార్యక్రమాలు ఉంటాయని, విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. తద్వారా ప్రాంతం రాబోయే ఐదేళ్లలో నాలుగు రెట్లు అభివృద్ధి జరుగుతుందన్నారు. అనేక సమస్యలు దూరం కావటంతోపాటు ప్రజలంతా సుభిక్షంగా ఉంటారన్నారు. యాగంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తోచిన విధంగా సహకారం అందించాలన్నారు. యాగం జరిగే 14రోజుల పాటు ఉదయం రాత్రికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉంటాయన్నారు. వెయ్యి దేవాలయాలు నిర్మిస్తే దక్కే ఫలం ఈ యాగంలో పాల్గొంటే వస్తుందన్నారు.

భక్తుల కోసం ఏర్పాట్లు..

విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న మహాయాగంలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయిస్తామని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి తెలిపారు. యాగాల వల్ల మంచి ఫలితాలు వస్తాయని, సీఎం కేసీఆర్ నిర్వహించే చండీయాగాల ద్వారా రాష్ట్రం గత పదేళ్లుగా సుభిక్షంగా ఉందని గుర్తుచేశారు. ఇలాంటి యాగం మన ప్రాంతంలో నిర్వహించటం అభినందనీయమని, అందుకే ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏర్పాట్ల పరిశీలనలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్‌యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, వార్డు కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, రఘురాంగౌడ్, లత స్థానికులు బాదేపల్లి రంజిత్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఆలంపల్లి మనోహర్, కోట్ల రాంచంద్రారెడ్డి ఉన్నారు.

కేసీఆర్‌వి కపట నాటకాలు

- గద్దర్‌కు రెండేళ్లుగా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు
- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపణ



మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: సీఎం కేసీఆర్‌వి అన్నీ కపట నాటకాలేనని, ఆయన పరిపాలన పైన పటారం, లోన లొటారం మాదిరిగా ఉందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన తొలిసారిగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజా గాయకుడు గద్దర్ రెండేళ్లుగా అపాయింట్‌మెంట్ అడిగితే కేసీఆర్ ఇవ్వలేదని, ఈ విషయం స్వయంగా గద్దరే తనకు చెప్పారన్నారు. ఆయన చనిపోయాక అధికారికంగా అంత్యక్రియలు నిర్వహిస్తే ఉపయోగం ఏమిటన్నారు. గతంలో జయశంకర్ సార్‌కు సైతం ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని, ఈ విషయాలను ప్రొఫెసర్ హరగోపాల్ తనకు చెప్పారన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి పదవి విద్యాసాగర్‌రావుకు ఇవ్వాలని జయశంకర్ సూచిస్తే.. సరే అని చెప్పి ఆ పదవిని తన మేనల్లుడు హరీశ్‌రావుకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. 90 రోజుల్లో ఎన్నికలు ఉండగా ఇప్పుడు కొత్త పథకాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజుల గడువు ఇచ్చి.. మద్యం దుకాణాల కోసం 15 రోజుల గడువు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ వందల ఎకరాల్లో ఫాంహౌజ్ కట్టుకొని, పేదలకు మాత్రం 75 గజాల స్థలాలు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని జోష్యం చెప్పారు. సమావేశంలో నాయకులు నాగరాజు, నర్సింహ, రహీంపాషా, నయీం, కిరణ్‌యాదవ్, ఎక్బాల్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.